క్లుప్తంగా

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పెంబి: డెంగీపట్ల అప్రమత్తంగా ఉండాలని పెంబి పీహెచ్‌సీ హెచ్‌ఈవో రమేశ్ అన్నారు. మండలంలోని కిష్టునాయక్‌తండాలో పదేళ్ల బాలుడు డెంగీతో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గ్రామంలో జ్వరంతో ఉన్న 75మంది అనుమానితులకు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కుండీలో నిల్వనీటిని పారబోశారు. హెల్త్ అసిస్టెంట్ సోము, సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న సీఐ నైలు

కుంటాల: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని భైంసా రూరల్ సీఐ నైలు హెచ్చరించారు. శనివారం రాత్రి దౌనెల్లి తండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అక్రమ మద్యం, డబ్బులు తరలించొద్దన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి సహకరించాలని కోరారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వెంకటాపూర్‌లో పోలీసుల తనిఖీలు

మామడ: మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని గుడుంబా తయారీ, విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించి ముడిప దార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఘనంగా చండీయాగం


పాల్గొన్న ఎస్సై దంపతులు

కుంటాల: మండలంలోని అంబకంటితండాలో శ్రీ జగదాంబదేవి, రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. వేద పండితుడు శ్రీ భగవాన్ జోషి ఆధ్వర్యంలో శనివారం చండీయాగం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ దీక్ష గురుప్రేమ్‌సింగ్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సై హన్మాండ్లు, సర్పంచ్ జాదవ్ శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాథోడ్ విమల, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ముథోల్: మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన 'మనుషుల అక్రమ రవాణా నివారణలో అంగన్‌వాడీ పాత్ర' అనే అంశంపై శనివారం అంగన్‌వాడీలకు శిక్షణ నిర్వహించారు. సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ వారికి అవగాహన కల్పించి పలు సూచనలు అందజేశా రు. అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివకుమార్, సీడీపీవో శ్రీమతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం

మామడ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు కారుగుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా ఐకేరెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు దేవేందర్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, గంగారెడ్డి, హన్మాగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, అలీం, అశోక్, పాష ఉన్నారు.

సోన్: బీఆర్‌ఎస్‌తోనే యాదవుల అభివృద్ధి సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా యాదవ సంఘ నాయకుడు మనోజ్‌యాదవ్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం, పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌కే యాదవుల మద్దతు ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ బండి లింగన్న పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం సమీపంలో శనివారం పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అదుపులో తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3,410 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ శివారులో పక్కా సమాచారంతోనే పేకాటస్థావరంపై శనివారం దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5320 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలతో సతమతం

- భైంసాలోని శివారు కాలనీలు
- రోడ్లు, డ్రెయినేజీలు లేవు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు


మట్టిరోడ్డుపై పారుతున్న మురుగునీరు


సీసీ లేని ఏపీనగర్ ప్రధాన రోడ్డు

భైంసాటౌన్: పట్టణంలోని శివారు కాలనీల్లో ప్రజలు నిత్యం సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలనీలు ఏర్పడి దాదాపు 25 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికలు ఎన్ని వచ్చినా తమ బతుకులు మారడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులైన సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతవాసుల కంటే అధ్వాన పరిస్థితుల మధ్య గడుపుతున్నామని వాపోతున్నారు. కొన్నిప్రాంతాల్లో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే జంకుతున్నారు. పాలకులు మారినా..కాలనీల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నాయని చెబుతున్నారు.

25 ఏళ్లుగా సమస్యల్లోనే..

శివారు కాలనీలు ఏర్పడినాటి నుంచి ఇప్పటికీ అక్కడ పూర్తిస్థాయిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. సీసీ డ్రెయినేజీలు లేకపోవడంతో నివాసాల మధ్యనే మురుగునీరు నిలుస్తోంది. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు మట్టి రోడ్లపై నుంచే పారి పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. పందులు, దోమల బెడదతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్లు లేకపోవడంతో మట్టి

శివారు కాలనీలు	: 4,6 వార్డుల పరిధిలో శివారు కాలనీలు విస్తరించి ఉన్నాయి. నాలుగోవార్డు పరిధిలో ఏపీనగర్, శివాజీనగర్, పిప్రికాలనీలు ఉండగా, ఆరో వార్డు పరిధిలో గోపాల్‌నగర్, శాస్త్రినగర్, సుభాష్‌నగర్, సంతోష్‌నగర్ ఉన్నాయి.
జనాభా	: దాదాపు 5 వేలకుపైగా...
ఓటర్లు	: దాదాపు 3వేలకు పైగా..
సమస్యలు	: సీసీ రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, ఇతర

రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తాయి. ముఖ్యంగా గోపాల్‌నగర్, సంతోష్‌నగర్, ఏపీనగర్, ఎన్‌బీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పూర్తిస్థాయిలో లేవు. కల్వర్టులు సైతం లేక వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి మురుగునీరు చేరుతోంది. శాస్త్రినగర్, సుభాష్‌నగర్, పిప్రికాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఉన్నా.. కొన్ని ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. వీధిదీపాలు సైతం కొన్నిచోట్ల లేకపోవడంతో రాత్రివేళ మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

ఉపాధి లేక గ్రామీణ ప్రాంతాలకు..


కల్వర్టు లేక తాత్కాలికంగా వేసిన పైపు

శివారు కాలనీల్లో పేద కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఎంతోమంది కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గతంలో భైంసాలో 45 వరకు పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండేవి. ఇక్కడ వేలాది మంది ఉపాధి పొందేవారు. 25 ఏళ్ల కిందట నిర్మల్ రోడ్డులోని పట్టణ శివారులో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. చాలామంది ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో జిన్నింగ్ మిల్లులు మూతపడడంతో ప్రస్తుతం నాలుగైదు ఫ్యాక్టరీలు మాత్రమే పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయి. దీంతో ఉపాధి కోల్పోయిన చాలామంది కూలీ పనులు చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి



మేము గోపాల్‌నగర్‌లో 20 ఏళ్ల కిందట వచ్చి స్థిరపడ్డాం. అప్పటి నుంచి ఇప్పటివరకు కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు. వర్షాకాలంలో మట్టిరోడ్లతో ఇబ్బంది పడుతున్నాం. దోమలు, పందుల సంచారంతో రోగాల బారిన పడుతున్నాం. రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి.

– మీరాబాయి, స్థానికులు

పని లేక వ్యవసాయ పనులకు...



మేము దాదాపు పదేళ్ల కిందట ఏపీనగర్‌కు వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నాం. కాలనీ ఏర్పడి ఇన్నేళ్లు అవుతున్నా రోడ్లు, డ్రెయినేజీలు లేవు. ఉపాధి కోసం గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తోంది. నాకు 60 ఏళ్లు ఉన్నా వృద్ధాప్య పింఛన్ వస్తలేదు.

– పంచపూల, స్థానికులు

కుటుంబ పోషణకు ఇబ్బంది



కుభీర్ నుంచి భైంసాకు 20 ఏళ్ల కిందట వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాం. ఇంట్లో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తేనే కడుపు నిండేది. ఆయన కూలీ పనికి వెళ్తే, నేను గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్తాను. అది కూడా పనులున్నప్పుడే ఉపాధి. లేనప్పుడు ఖాళీగానే ఉంటున్నాం. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాం.

– సవిత, ఏపీనగర్ వాసి, భైంసా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


వానల్‌పాడ్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో లక్ష్మి

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం విక్రయించాలన్నారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రూ.2203, బీ గ్రేడ్ రూ.2182 మద్దతు ఇస్తారని తెలిపారు. రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ బొప్పారం సాయారెడ్డి, గ్రామస్తులు ఈశ్వర్, రాంకుమార్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని పీఏసీఎస్ సీఈవో చిన్నయ్య అన్నారు. మండలంలోని వాస్తాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు దిగంబర్, నర్సారెడ్డి, భోజన్న, ముత్యం ఉన్నారు.

కుంటాల: కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ కార్యదర్శి నాగభూషణం కోరారు. మండలంలోని అంబకంటి, కుంటాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, బోజేందర్, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం


లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పార్టీ మండల ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్ వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి ఆలూరి రాజు, శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఓస రాజేశ్వర్, నాయకులు కంతి రమేశ్, బొజ్జ రాములు, నాయుడు భీమేశ్, బొజ్జ శ్రీనివాస్, సల్కం మల్లేశ్, రమేశ్, సురేశ్, తలకొక్కుల పెద్ద ముత్తన్న పాల్గొన్నారు.

కుంటాల: ముథోల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవార్ రామారావు పటేల్‌ను గెలిపించాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ కోరారు. మండలంలోని వెంకూర్, అందాకూర్ గ్రామాల్లో శనివారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పవార్ రామారావు పటేల్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. నాయకులు జీవి రమణారావు, ఎగ్గం గజ్జారాం, రామారావు, తాటి శివ, కల్యాణ్ గజేందర్, జక్కుల గజేందర్, సాయినాథ్, గోవింద్‌రావ్, రిటైర్డ్ ఉద్యోగులు సోమశంకర్, రాంనాథ్ పాల్గొన్నారు.

కుభీర్: ముథోల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామారావ్ పటేల్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆయన తనయుడు డాక్టర్ సతీశ్ పటేల్ సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి రామారావ్ పటేల్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు బి.గంగాశేఖర్, వి.నాగేష్, లక్ష్మణ్, నాగేందర్, కనకయ్య, ఉప్పు దత్తాత్రి, సాయినాథ్, మల్లేశ్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో బీజేపీ ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. మంద భాస్కర్, నారాయణ్, లింగన్న తదితరులు ఉన్నారు.

'బీజేపీతోనే ఖానాపూర్ అభివృద్ధి'


సర్పంచ్ భూమేశ్‌కు కండువా కప్పుతున్న రాథోడ్ రమేశ్

దస్తురాబాద్: ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని మల్లాపూర్ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మల్లాపూర్ గ్రామ సర్పంచ్ శీదర్ల భూమేశ్‌తోపాటు వందమంది బీజేపీలో చేరారు. రాథోడ్ రమేశ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు చుంచు వెంకన్న, రాజేశం, స్వామి, సాగర్, వెంకటరమణ, గంగాధర్, రఘు, రాయమల్లు, రాజేష్ తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం



మాట్లాడుతున్న బొమ్మన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై మరో పోరాటం చేయాలని సీపీఎం నిర్మల్ డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులు, అంగన్‌వాడీల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. రోజు రోజుకు పనిభారం, పని గంటలను పెంచుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే పార్టీల అభ్యర్థులను నిలదీయాలన్నారు. నిర్మల్ ఏరియా కమిటీ సభ్యులు డి.పోశెట్టి, క్లైమెంటు వెస్లీ, అదిక్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తో అభివృద్ధి'


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణగౌడ్

సోన్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని జెడ్పీటీసీ జీవన్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తుందన్నారు. ప్రజలు మరోసారి కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోహినొద్దీన్, మండల ఇన్‌చార్జీలు మహేశ్‌రెడ్డి, అనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు నర్సయ్య, మాజీ సర్పంచులు తోట సాయన్న, రోడ్డ రాజేశ్వర్, కిరణ్‌రావు, భూమేష్, సురేశ్ యాదవ్, ప్రశాంత్, శబరి, బాబు, మల్లయ్య పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగ దూడలు


రెండు ఆవు దూడలతో గోపాలమిత్ర సురేందర్

సోన్: ఒకే ఈతలో రెండు లేగ దూడలు జన్మించిన సంఘటన మండలంలోని మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో చోటుచేసుకుంది. రైతు రోడ్డ రాజన్నకు ఆవు ఉంది. అది ఒకే కాన్పులో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. ఆవు గర్భధారణ సమయంలో రెండు అండాలు విడుదలైనప్పుడు ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని మండల పశువైద్యాధికారి మహేశ్ శనివారం తెలిపారు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. గోపాలమిత్ర జంగం సురేందర్ ఉన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో పోగొట్టుకున్న పర్సును పట్టణ ట్రాఫిక్ పోలీసులు బాధితురాలికి శనివారం అప్పగించారు. ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన కుంటాల గంగవ్వ యాదగిరిగుట్ట వెళ్లడానికి ఆటోలో నిర్మల్ బస్టాండ్‌కు చేరింది. ఆ సమయంలో పర్సు మరిచిపోయింది. యాదగిరిగుట్ట వెళ్తుండగా స్థానిక మంచిర్యాల చౌరస్తా వద్ద ఆమె పర్సు చూసుకోగా కనిపించలేదు. తిరిగి బస్టాండ్ చేరుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్ రవికి ఈ విషయం చెప్పింది. వెంటనే ఆటోస్టాండ్ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఆటో బైల్ బజార్‌కు వెళ్లిందని తెలుసుకుని వెంబడించి పట్టుకున్నారు. పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాలతో ఆమెకు పర్సును అప్పగించారు. పర్సులో రూ.5వేల నగదు, రూ.20 వేల విలువగల మొబైల్ ఉంది.

బీజేపీలోకి మాజీ సర్పంచ్

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామ మాజీ సర్పంచ్ అన్న లక్ష్మి శనివారం బీజేపీలో చేరారు. నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు పార్టీ కండువా కప్పారు. మార గంగారెడ్డి, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఖానాపూర్/కడెం: కడెం, పెంబి మండలాల్లోని గ్రామాల నాయకులు, యువకులు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల స్వామి, కార్యకర్తలతో కలిసి శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన సుమారు 50 మంది గులాబీ కండువా కప్పుకున్నారు. ఖానాపూర్‌లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, లచ్చన్న, తదితరులు ఉన్నారు. అంతకముందు ఖానాపూర్ మండలం సుర్జాపూర్‌లో మృతి చెందిన బోయిని లస్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారంటీ పథకాలు

- నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు


మాట్లాడుతున్న శ్రీహరిరావు

నర్సాపూర్(జి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ఆ పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కుచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని అన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రకటించిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై ఇటీవల గ్రామ సర్పంచ్ గోవింద్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా, శ్రీహరిరావు వారికి కండువాలు కప్పారు. సర్పంచ్ గోవింద్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రణవ్ కుమార్, ప్రవీణ్‌కుమార్, సాయిరాం, జంగోళ్ల రమేశ్, రావుల చిన్నయ్య, ధ్యాగ రాములు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను ఆదరించాలి'


జుమ్డలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని మండల నాయకులు కోరారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటా ప్రచారం

కుభీర్: మండలంలోని హల్దా, జుమ్డ, సాంగ్వి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థి బోస్లే నారాయణ్ పటేల్ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు బంక బాబు, నాయకులు జయరాం, అభయ్, సిద్ధార్థ, రవి తదితరులు ఉన్నారు.

పాక్‌పట్ల గ్రామంలో..

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో రెండో రోజూ కాంగ్రెస్ ప్రచారం కొనసాగింది. కాంగ్రెస్ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు గెలిపించాలని ఆయన కుమార్తె న్యాయవాది మాధురి శనివారం గ్రామంలో ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి శ్రీహరిరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సింగిరెడ్డి దినేష్, మధుకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్, ఒడ్డెరవాడకు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు దయానంద్ వారికి కండువాలు కప్పారు. పాపయ్య, వెంకటి, దర్మరాజు, సంతోశ్, రాజు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

రక్తదానం

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రానికి చెందిన మధు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని పుట్టినరోజు సందర్భంగా శనివారం తోటి మిత్రులు నిర్మల్‌లో రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిత్రులను పలువురు అభినందించారు. మిత్రబృందం రోహిత్, మణి, నాగేశ్, గణేశ్, సిద్ధూ, శివ, ముత్యం, రవి, విజయ్, ఆకాశ్, చింటూ, సాయి, వికాస్, సందీప్, సన్ని పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశ్ గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దాతల సహకారంతో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్నాడు. మల్లేశ్‌కు ఫిజియోథెరపి చికిత్స నిమిత్తం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు గంగన్న శనివారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

పార్డి(కె)లో తాళసప్తాహం

కుభీర్: మండలంలోని పార్డి(కె) గ్రామంలోని రాజరాజేశ్వర మందిరంలో శనివారం తాళ సప్తాహం ప్రారంభమైంది. సప్తాహంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. చివరిరోజు అన్నదానం నిర్వహిస్తారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ తండ్రి గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, నరేశ్‌రెడ్డి, జహీరొద్దీన్ ఉన్నారు.

పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన


రాజ్యసభలో చర్చించే విధానం చూపుతున్న విద్యార్థులు

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకులం విద్యార్థులకు ప్రపంచ నమూనా ఐక్యరాజ్య సమితి, పార్లమెంటరీ వ్యవస్థపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాకళ్యాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కీలకమన్నారు. ఈ విషయాలపై విద్యార్థులకు తెలియజేసే బాధ్యత గురువులపై ఉందన్నారు. అనంతరం పార్లమెంటులో జరిగే ప్రజాపరిపాలన విధానాలు, ప్రపంచంలో జరిగే అరాచకాలను అరికట్టగలిగి శాంతికి చేసే ఐరాస పనులు, వ్యవస్థలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.